క్లుప్తంగా

చిల్లకంప తొలగింపు



చిల్లకంపను తొలగిస్తున్న జేసీబీ

బేస్తవారిపేట: మండలంలోని సలకలవీడులో శివాలయం, హనుమాన్ టెంపుల్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చిల్లకంపతో నిండిపోయింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బిక్కా రామాంజనేయరెడ్డి జేసీబీ యంత్రంతో చిల్లకంప తొలగింపు చర్యలు చేపట్టారు. ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు బాగు చేయడంతో గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వనవిహారి వద్ద క్యాంటీన్ టెండర్లు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీశాఖ అభయారణ్యం పరిధిలోని దిగువమెట్ట గ్రామ సమీపంలో నంద్యాల రోడ్డులో ఏర్పాటు చేసిన వనవిహారి ముందు భాగంలో క్యాంటీన్ ఏర్పాటు కోసం ఈ నెల 23 వ తేదీ టెండర్లు ప్రారంభించనున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ నిషా కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వన విహారిని సందర్శించే సందర్శకులకు తినుబండారాలు విక్రయించేందుకు ముందుభాగంలో 20 పొడవు, 10 వెడల్పు మేర స్థలం కేటాయించి 2026 సంవత్సరం వరకు లీజు ఇచ్చేందుకు టెండర్లను ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ క్యాంటీన్లు కేవలం పగటి పూట మాత్రమే నిర్వహించేందుకు అనుమతులు ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు 9440810244 సెల్ నంబరును సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

ప్రతి 3వ శనివారం స్వచ్ఛ దివాస్



ప్రజలతో స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో మస్తాన్‌వలి

కొమరోలు: మండలంలోని గ్రామ పంచాయతీలో ప్రతి 3వ శనివారం స్వచ్ఛదివాస్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి తెలిపారు. కొమరోలులోని 4 రోడ్ల కూడలి వద్ద స్వచ్ఛ దివాస్ కార్యక్రమానికి సంబంధించిన ప్రతిజ్ఞను శనివారం ప్రజల చేత నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరోలులోని 1, 2, 3 గ్రామ సచివాలయాల పరిధిలో స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మురికిగా ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమాన్ని పంచాయతీ కార్మికులచే చేయించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



నవోదయ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ మాల్యాద్రి

కంభం: నవోదయ ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించారు. 483 మంది విద్యార్థులకు గాను 278 హాజరుకాగా 205 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి తనిఖీ చేశారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా ఆంజనేయులు



నియామకపత్రం అందుకుంటున్న ఆంజనేయులు

మార్కాపురం: పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా పాదర్తి ఆంజనేయులును నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు తెలిపారు. పట్టణంలోని దోర్నాల బస్టాండ్ సమీపంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఆంజనేయులును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లారెడ్డి, బొంతల కృష్ణ, చిన్నయ్య, చక్రి పాల్గొన్నారు. అనంతరం నియామక పత్రం అందించారు.

స్వచ్ఛత తోనే ఆరోగ్యం



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

మార్కాపురం టౌన్: స్వచ్ఛత తోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని విద్యుత్ శాఖ మార్కాపురం డీఈ కార్యాలయ సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర..స్వచ్ఛ దివాస్ కార్యాక్రమం శనివారం నిర్వహించారు. డీఈ కార్యాలయం పరిధిలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు నష్టాల ఘాటు

- వైరస్ తెగులుతో తగ్గిన దిగుబడులు
- గుంటూరు యార్డులో కూడా తగ్గిన మిర్చి ధర
- పశ్చిమ ప్రకాశంలో 45,813 ఎకరాల్లో సాగు



గ్రేడ్ చేసిన మిర్చి

తర్లుపాడు: మంచి లాభాలు వస్తాయని ఆశించి మిర్చి సాగుచేసిన రైతులు ఒకవైపు తెగుళ్లు, మరో వైపు ధరలు లేక నష్టాలను చవిచూస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు, గిద్దలూరు, రాచర్ల, బేస్తవారిపేట, అర్థవీడు, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో గతేడాది ఖరీఫ్‌లో, రబీలో 45,813.59 ఎకరాల్లో సాగైంది. అయితే 2 నెలల క్రితం కురిసిన అకాల వర్షాలు, వాతావరణ మార్పులతో మిర్చికి వైరస్, ఎర్రనల్లి తెగులు సోకడంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఎకరాకు 2 క్వింటాళ్ల మేర తెగుళ్ల వలన దిగుబడులు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గుంటూరు మిర్చి యార్డులో కూడా ధరలు పతనమవుతున్నాయి. డిసెంబరులో క్వింటా మిర్చి ధర రూ.16 నుంచి రూ.18 వేలు ఉండగా ప్రస్తుతం రకాన్ని, నాణ్యతను చూసి రూ.11 నుంచి రూ.13 వేలకు మాత్రమే కొంటామని అంటున్నారు. దీంతో ఈ ఏడాది మిర్చి సాగుచేసిన రైతులు నష్టాలపాలవుతున్నారు. మరో వైపు మార్కాపురంలో మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నా కూటమి ప్రభుత్వం నుంచి స్పందన లేదు.



కల్లాల్లో ఆరబోసిన మిర్చి

పశ్చిమ ప్రకాశంలో మిర్చి సాగు ఇలా:

మండలం	ఎకరాలు
మార్కాపురం	2657.52
తర్లుపాడు	1520.42
పెద్దారవీడు	4543.83
వై పాలెం	10409.49
పుల్లలచెరువు	8098.75
త్రిపురాంతకం	5767.35
రాచర్ల	1086
బేస్తవారిపేట	910.59
కంభం	342.23
కొనకనమిట్ల	765.01
గిద్దలూరు	893.33
కొమరోలు	152.31
అర్థవీడు	2207.97
పొదిలి	641.69
దోర్నాల	5817.10
మొత్తం	45,813.59



వైరస్ తెగులుతో తగ్గిన దిగుబడి

ఈ ఏడాది 5 ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. అయితే అనుకోని వివిధ రకాల తెగుళ్లు సోకడంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి. కాయ చూడాలంటేనే బాధగా ఉంది. మొత్తం కూలీలను పెట్టి కోత కోయిస్తే సుమారు 50 క్వింటాళ్లు రాగా అందులో 40 క్వింటాళ్ల వరకూ తక్కువ రకం క్వాలిటీ ఉండే మిర్చి తేలింది. దీంతో యార్డులో ఇలాంటి మిర్చిని క్వింటా రూ.10 వేలకు కూడా కొనే స్థితిలో లేరని, ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతు, మీర్జపేట



ధర తగ్గిపోయింది

ఈ ఏడాది 4 ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. ఎకరాకు సుమారు రూ.1 లక్ష వరకూ ఖర్చు వచ్చింది. తీరా చూస్తే తెగుళ్లు రావడంతో కాపుతగ్గింది. నాణ్యత కూడా తగ్గింది. ధర చూస్తే గత నెలకు ఇప్పటికి క్వింటాకు సుమారు రూ.5 వేలు తేడా వస్తోంది. మొత్తం మీద 2వ కోత నుంచి మిర్చి రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వమే మిర్చి రైతులను ఆదుకోవాలి.

– పగడాల రమణారెడ్డి, రైతు, మీర్జపేట



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

కూటమి ప్రభుత్వంలో అన్నీ ఇబ్బందులే

- విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో తీవ్ర జాప్యం
- వెంగళలపల్లి ఎస్సీ కాలనీ వాసుల ఆందోళన

కొనకనమిట్ల: కూటమి ప్రభుత్వంలో పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండలంలోని కాట్రగుంట పంచాయతీ వెంగళపల్లి ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీ వాసులు మాట్లాడుతూ పంచాయతీలో అన్నీ చోట్లా ఇటీవల కొత్తగా విద్యుత్ లైన్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే తమ కాలనీలో మాత్రం విద్యుత్ లైన్ కానీ, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కానీ ఏర్పాటు చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు. కూటమి నాయకులు ప్రోద్బలంతో అధికారులు పక్షపాతవైఖరి అవలంబిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అన్నీ రకాలుగా ఇబ్బందులు పెడుతోందని వాపోతున్నారు. దళితులకు అన్యాయం చేస్తూ తమ పట్ల చిన్న చూపు చూస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో లోఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరినా కూటమి నాయకుల మాటలు విని అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు గుప్పించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎస్సీ కాలనీ వాసులు గొంగటి మార్కు, గొంగటి సౌభాగ్యం, తాళ్లూరి నాసరయ్య, దేవదానం, భాస్కర్ కోరుతున్నారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా విజయభాస్కరరావు

తర్లుపాడు: మండల ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడిగా జవ్వాజి విజయభాస్కరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పట్టాభిరామస్వామి దేవాలయంలో నూతన కమిటీ ఎంపిక నిర్వహించారు. బొంతల సుధీర్, పేరం ప్రసాద్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా కె.రవికుమార్ ఎంపికయ్యారు. సంఘం అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీ అధ్యక్షులు కె.జగన్‌బాబు, ఆలిండియా ఆర్యవైశ్య సంఘ ఏపీ జాయింట్ సెక్రటరీ పోలేపల్లి జనార్దన్, వాసవీ సత్రం మెంబరు దోగిపర్తి మల్లికార్జునరావు, స్థానికులు జవ్వాజి వెంకటేశ్వర్లు, గాదంశెట్టి శేషగిరిరావు, వాగిచర్ల మోహన్‌రావు, టి.సురేష్, నున్న సుబ్బారావు, చిన్నమనగుండం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



విజయభాస్కరరావును అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

బాబాపై దుష్ప్రచారం చేస్తే చర్యలు

మార్కాపురం టౌన్: శ్రీ షిరిడీ సాయిబాబా పరిరక్షణ సేవా సొసైటీ ద్వారా రాష్ట్రంలోని పాత 13 జిల్లాల్లో వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నెహ్రూ బజారులోని శ్రీ షిరిడీ సాయి మందిరం కార్యదర్శి గోపాలుని హరిహరరావు స్పష్టం చేశారు. శనివారం సాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ఉన్న 13 జిల్లాల్లో శ్రీ షిరిడీ సాయిబాబా ధర్మపరిరక్షణ సేవా సొసైటీ 389/2024 నంబర్ కింద గుంటూరులో రిజిస్టర్ చేసినట్లు పేర్కొన్నారు. సంస్థ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా షిరిడీ సాయి తత్వ ప్రచారాన్ని నిర్వహించడం, మానవసేవే మాధవ సేవ అనేది బాబా తత్వమని, సాయిబాబా సూక్తులను అనుసరించి రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలనేది తమ అందరి ఉద్దేశమన్నారు. సొసైటీ ద్వారా నియోజకవర్గ పరిధిలో, జిల్లాల పరిధిలో కొంతమంది కార్యకర్తలతో కమిటీలు ఏర్పాటు చేసి ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న షిరిడీ సాయి మందిరాలన్నింటినీ ఏకం చేస్తూ అన్నీ జిల్లాల్లో, రాష్ట్రాల్లో కమిటీలు ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద బహిరంగ సభ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. షిరిడీ నుంచి సాయి సంస్థ చైర్మన్, షిరిడీ సంస్థాన్ డైరెక్టర్లను ఆహ్వానించి సమావేశం ఏర్పాటు నిర్వహించాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు. సాయిబాబా భక్తులు ఆయన అనుభవాలతోనే భక్తులుగా మారారని, ఇటీవల కాలంలో కొందరు పనిగట్టుకొని శ్రీ షిరిడీసాయినాథునిపై దుష్ప్రచారాలు చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారన్నారు. అలాంటి వారేవరైనా ఉంటే వచ్చి కూర్చుని తమతో స్నేహపూర్వకంగా ఉంటే సందేహాలను తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని, లేని పక్షంలో బాబాపై దుష్ప్రచారాలను చేస్తుంటే భక్తులు చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ విషయంపై గుంటూరులో డీజీపీని కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. షిరిడీ సాయి ధర్మ పరిరక్షణ సేవా సొసైటీ రాష్ట్ర కోశాధికారి రజనీకుమార్, బాబా మందిరం అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, సభ్యులు ఓఏ మల్లిక్, సాయి సుబ్బారావు, నాగరాజు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యదర్శి హరిహరరావు

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

- ఆర్‌టీఓ అమర్ నాయక్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు, ప్రజలు, డ్రైవర్లు సహకరించాలని మార్కాపురం ఆర్టీఓ అమర్ నాయక్ సూచించారు. శనివారం ఆర్‌టీఓ కార్యాలయం ఆవరణలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పలువురు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించి డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క డ్రైవరూ తమ వాహనానికి ఫిట్‌నెస్‌తో పాటు కచ్చితంగా ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, విధిగా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని చెప్పారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం వల్లే ఎక్కువగా రోడ్డు యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు తమ కుటుంబ సభ్యులను గుర్తుకు తెచ్చుకోవాలని చెప్పారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఒక చేత్తో డ్రైవింగ్ చేస్తే కచ్చితంగా యాక్సిడెంట్ జరుగుతుందన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ తరుచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు మాట్లాడుతూ డ్రైవర్లు ఆరోగ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకూ రోడ్డు భద్రత మాసోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. వైద్య సిబ్బంది మహేష్ కుమార్, అంజి తదితరులు ఆటో డ్రైవర్లకు వివిధ రకాల పరీక్షలు చేయించారు.



మాట్లాడుతున్న ఆర్‌టీఓ అమర్ నాయక్

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవునికి శాంతి కళ్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కళ్యాణం అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయం మధ్య రంగ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ పి.కేశవరావు, ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.



స్వామి వారికి కళ్యాణం చేస్తున్న అర్చకులు

ఏపీఎన్‌జీజీఓ నూతన కార్యవర్గం



ఏపీఎన్‌జీజీఓ నూతన కార్యవర్గ సభ్యులు

పొదిలి రూరల్: పొదిలి ఏపీఎన్‌జీజీఓ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఏపీఎన్‌జీజీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కో ఆపరేటివ్ పరిశీలికులు ఎం.వెంకటేశ్వరరావు సమక్షంలో పొదిలి తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లేళ్ల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సంధానిబాషా, కోశాధికారి జి.వెంకట్రావు, సహాధ్యక్షుడిగా అబ్దుల్ రహిమాన్, ఉపాధ్యక్షులుగా కరిముల్లా, అబ్దుల్ ఆరిఫ్, సీహెచ్ వెంకటేశ్వర్లు, కె.విజయ, సంయుక్త కార్యదర్శులుగా పి.కళాప్రపూర్ణ, ఎస్‌కే ఈసుఫ్, సీహెచ్ ప్రిన్సీ తనూజ, జె.వెంకటేశ్వర్లు, పి.విజయకుమారి, స్టేట్ కౌన్సిల్ మేయర్ పి.రవిశంకర్, డీఈసీ మెంబరు రమాదేవిలను ఎన్నుకున్నారు.

ఓవర్ లోడ్‌తో వాహనాలు నడపొద్దు



ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం: ఓవర్ లోడ్‌తో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని టూ టౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 30 మంది ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రయాణికులను ఆటో నిండా ఎక్కించుకోవడంతో పాటు డ్రైవరుకు ఇరువైపులా కూర్చోబెట్టుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యం, ఓవర్ లోడ్‌తో ప్రయాణికులను ఎక్కించుకుని తిరగడం వల్లే జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తే ఎంతటి వారినైనా క్షమించేది లేదన్నారు. ఫైన్లు విధించడంతో పాటు ఆటోను కూడా సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ చిరంజీవి, నాయకులు

మార్కాపురం: కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా కేవీపీఎస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. అంటరానితనం నేరమని, దానిని నిర్మూలించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు జవ్వాజి రాజు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు జి.బాలనాగయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, కేవీపీఎస్ నాయకులు కాశయ్య, దాసు, యాకోబు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ



జైలును తనిఖీ చేస్తున్న జడ్జి బాలాజీ

మార్కాపురం: మార్కాపురం సబ్ జైలును ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జి.బాలాజీ శనివారం తనిఖీ చేశారు. జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. వారికి లభిస్తున్న సేవలు అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జైలులో ఏవైనా కుల వివక్ష ఉందా.. అని ఆరా తీశారు. ఖైదీలకు జైలులో సమస్యలున్నాయా అని తెలుసుకున్నారు. అనంతరం జైలు ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట న్యాయవాది రామచంద్ర, పారా లీగల్ వలంటీర్ షేక్ బాషా ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, అధికారులు

తర్లుపాడు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం స్వచ్ఛ–ఆంధ్ర స్వచ్ఛ–దివాస్‌లో భాగంగా ఆయన తర్లుపాడులో పాల్గొన్నారు. స్థానిక గ్రామ సచివాలయం పరిసరాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ చేశారు. ఈఓఆర్డీ సుకుమార్, సర్పంచ్ పి. వరాలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com